బెస్ట్ టీచర్ అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ ప్రొఫెసర్స్ కాలనీలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌కు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులు దక్కాయి. బీజేఆర్ భవన్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హైస్కూల్ హెచ్‌ఎం వి.మధుకుమార్ (సోషల్) శైలజ (తెలుగు) ప్రైమరీ టీచర్లు ఆర్. ప్రవీణ(మ్యాథ్స్) ఎస్.గిరిజ (ఆంగ్లం)కు మోమెంటో, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు.

బీజేపీ బలోపేతానికి కృషి



తులసి

మలక్‌పేట: బీజేపీ ఎస్సీ మోర్చా భాగ్యనగర్ జిల్లా స్పోక్స్ పర్సన్‌గా మలక్‌పేట నియోజకవర్గం మూసారంబాగ్‌కు చెందిన తులసి నియమితులయ్యారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ.. ఎస్సీల అభ్యున్నతి కోసం పనిచేస్తూ, బీజేపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు అన్నారు.

నియామకం



జైపాల్‌రెడ్డి

మన్సూరాబాద్: గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన పన్యాల జైపాల్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు చేస్తున్న కృషిని పార్టీ అధిష్ఠానం గుర్తించి పదవిని ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని గడ్డిఅన్నారం మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న జడ్జి మురళీమోహన్

వనస్థలిపురం: మహిళలు ప్రతి ఏడాది కేన్సర్‌తో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని హైదరాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి కే.మురళీమోహన్ అన్నారు. శనివారం వనస్థలిపురం చింతలకుంటలోని వాసవి శ్రీనిలయంలో మాభూమి సాహితీ, సాంస్కృతిక చైతన్య వేదిక, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి హాజరైన 160 మంది మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందజేసినట్లు డా.ప్రియాంక, కోఆర్డినేటర్ సర్వేశ్వర ప్రసాద్ తెలిపారు.


అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తా



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీలో రూ.21లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తెచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.కార్పొరేటర్ వెంట కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, రఘుమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మీనారాయణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుక పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్: హయత్‌నగర్ ప్రాజెక్ట్ విభాగం ఎన్‌టీఆర్ నగర్ సెక్టర్ సూపర్‌వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో శనివారం సాహెబ్‌నగర్‌లో పోషణ మాస వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.వారోత్సవంలో భాగంగా అక్షరభ్యాసం, అన్నప్రాసన్న కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హయత్‌నగర్ ప్రాజెక్ట్ సీడీపీఓ రేణుక మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకుంటే రక్తహీణత రాకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్, రాధకృష్ణ, అధికారులు యాదగిరి, శ్రీనివాస్, మౌనిక, ఆశ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 39, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 18-23, కాకర రూ. 48, బీర రూ. 52, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 47, దొండ రూ. 45, చిక్కుడు రూ. 85, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 23, సొర రూ. 17, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 54, చామగడ్డ రూ. 40. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

దుమ్ములేస్తున్నా మరమ్మతు చేయరు!



హయత్‌నగర్ డివిజన్ కుమ్మరి కుంట చెరువు కట్ట రోడ్డు గుంతలమయంతో పాటు కంకర తేలి వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మీదుగా నిత్యం వాహనాలు రాకపోకాలు సాగిస్తుంటాయి. గతంలో కట్టమీదుగా బీటీ రోడ్డు ఉండగా మూడేళ్ల క్రితం వచ్చిన వర్షాలతో కట్ట కొంత మేర కొట్టుకపోవడంతో రోడ్డు ధ్వంసమైంది. కట్టను పునరుద్దరించి రోడ్డును నిర్మించారు. మట్టి రోడ్డు కావడంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి దుమ్ము లేస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - లింగోజిగూడ

మంత్రులొస్తేనే మరమ్మతులా?



ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు అదే మంత్రులు పర్యటనకు వస్తే మాత్రం ఆఘమేఘాల మీద రోడ్లకు మరమ్మతులు చేపడతారు. శనివారం వనస్థలిపురంలో డబుల్ బెడ్రూమ్ సముదాయం పరిశీలనకు మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నారని తెలియడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆయా మార్గాల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యాలు సాక్షి కంటపడ్డాయి. - వనస్థలిపురం

ఓటరు జాబితా సవరణలపై ఇంటింటి సర్వే



ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బీఎల్‌ఓ

- 300 బూత్‌లలో వివరాల సేకరణ

చాదర్‌ఘాట్: ఓటరు జాబితా సవరణలపై మలక్‌పేట నియోజకవర్గంలో ఇంటింటి సర్వే ముమ్మరంగా జరుగుతుంది. బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఓటరు జాబితాతో ప్రతి ఇంటికి వెళ్తున్నారు. స్పెషల్ సమ్మరి విజన్ (ఎస్‌ఎస్‌ఆర్) 2024-25లో భాగంగా ఓటరు జాబితా రూపొందిస్తున్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో ప్రస్తుతం 3,19,000 మంది ఓటర్లు ఉన్నారు. ఇంటింటి సర్వే ఇప్పటి వరకు 61 శాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సర్వేలో భాగంగా 120 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించారు.1200 మంది ఓటర్లు ఇప్పటి వరకు తాము ఉన్న ప్రాంతం నుంచి మరో చోటుకు వెళ్లినట్లుగా తేలింది. ఒక్క ఓటరు రెండు, మూడు చోట్ల ఓటు ఉన్న వారిని 200 మంది ఉన్నారు. ఇంటింటి సర్వేకు వెళ్లినప్పుడు 250 మంది ఓటర్లు ఆ అడ్రస్‌లో లేనట్లు గుర్తించారు. రెండు మూడు రోజులల్లో సర్వే పూర్తవుతోందని అధికారులు స్పష్టం చేశారు.

జనవరి 6న తుది జాబితా..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 300 పోలింగ్ బూతులలో బీఎల్‌ఓలు సర్వే చేస్తున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి జాబితాలో పేరున్నవారు ఉన్నారా...లేదా ఎక్కడికైనా వెళ్లిపోయారా..అనే వివరాలు సేకరిస్తున్నారు. ఇతర ప్రాంతానికి వెళ్తే ఆ ఓట్లను అక్కడికి బదిలీ చేశారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అక్టోబర్ 29న ముసాయిదా జాబితా, వచ్చే ఏడాది జనవరి 6న తుది జాబితా ప్రకటిస్తారు. ఓటరు జాబితా ఇంటింటికి సర్వే ముమ్మరంగా జరుగుతుందని జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 డీసీ జయంత్ పేర్కొన్నారు. బీఎల్‌ఓలు మొబైల్ యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. ఫిజికల్‌గా రిజిస్టర్‌లో కూడా రాయటం జరుగుతుందన్నారు. ఈఆర్‌ఓ లాగిన్‌లో ఎప్పటికప్పుడు మేము సర్వేను పరిశీలిస్తున్నామని ఓటర్లు ఇక్కడి నుంచి మరో చోటికి మారితే వారికి నోటీసులు పంపిస్తున్నామన్నారు.

మంత్రి పొన్నంకు జర్నలిస్టుల వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

చంచల్‌గూడ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శనివారం మలక్‌పేట నియోజకవర్గంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ క్రమంలో మలక్‌పేట నియోజకవర్గ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మలక్‌పేట వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్థలాల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వం నుంచి త్వరలో సానుకూల నిర్ణయం వెలువడుతుందని మంత్రి పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో సాయి, సర్వర్, అవినాష్, తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



పోలీసుల అదుపులో లోకేష్, స్వాధీనం చేసుకున్న గంజాయి

లింగోజిగూడ: గంజాయి సరఫర చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం.. తొర్రూర్ క్రాస్ రోడ్డులో శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బొల్లారంకు చెందిని పసుపతి లోకేష్ అనుమానాస్పదంగా సంచరిస్తుడడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించడంతో హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాబాద్: దసరా పర్వదినం పురస్కరించుకొని ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లలితా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో సంగీత, నృత్య, కవితా గోష్టిలు ఏర్పాటు చేస్తున్నామని ఆయా అంశాల్లో ప్రదర్శన ఇచ్చే కళాకారులకు ఆలయ కమిటీ వారిచే ఆశీర్వాద పూర్వక పత్రం, జ్ఞాపికలు, విజేతలకు బహుమతులు, ప్రోత్సాహక పారితోషకం అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న కళాకారులు ఈ నెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 98495 69626 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మహిళలపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



ఏసీపీ కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: గణేష్ నిమజ్జనం సందర్భంగా సరూర్‌నగర్‌లో దళిత మహిళలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేర బాలకిషన్(బాలన్న) శనివారం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరుకుతోట కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం నుంచి సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనం కోసం బయలు దేరి అరబిందో కాలేజ్ వద్దకు వెళ్లగానే అక్కడి వచ్చిన మన్సూరాబాద్‌కు చెందిన జక్కిడి రఘువీర్‌రెడ్డి, విజయ్, ప్రతీక్ వారి అనుచరులు అకారణంగా కులంపేరుతో దూషించి దాడులు చేసి గాయపరచారని అన్నారు. అక్కడ ఉన్న స్వరూప రాణితో పాటు మరికొంత మందిపై దాడులు చేసి చంపేస్తామని బెదిరించిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో బూర్గుల వెంకటేశ్వర్లు, గోపగోని రమేష్, భీమ ముత్యాలు, ఆవుల రమేష్, యాదగిరి, రేఖల నర్సింగరావు ఉన్నారు.

విద్యార్థులను నిత్యం పాఠశాలకు పంపించాలి



మాట్లాడుతున్న బత్తుల శ్రీనివాస్ రెడ్డి

నాగోలు: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైతే ఉపాధ్యాయులు బోధించే పాఠాలు స్పష్టంగా అర్థం చేసుకుంటారని పిల్లలను నిత్యం పాఠశాలకు పంపించాలని ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోలు జైపురికాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల మూడో శనివారం మీ పిల్లల చదువు ప్రగతిపై చర్చించేందుకు సమయం కేటాయించాలని అందరూ తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలకు రావాలని కోరారు. ఇంటి వద్ద విద్యార్థులకు రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆకృతి ప్రాజెక్టు జిల్లా ప్రతినిధి సీమ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటరని వారు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినాలని సూచించారు. మా ప్రాజెక్టు ద్వారా అందించిన వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ, బ్యూల, సుదారాణి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లలిత, తల్లిదండ్రులు ఆకృతి ప్రాజెక్టు జిల్లా ప్రతినిధి సీమ, భరత్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

బడంగ్‌పేట్: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సభ్యత్వ నమోదు కమిటీ కన్వీనర్, మాజీ సర్పంచ్ నడికుడి యాదగిరి అన్నారు. శనివారం బడంగ్‌పేటలో గ్రామ శాఖల సభ్యత్వ నమోదు 2024 కార్యక్రమాన్ని యాదగిరి ముఖ్యులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం పార్టీ పనిచేస్తోందన్నారు. పార్టీలో భాగస్వాములై వికసిత్ భారత్ లక్ష్య సాధనకు మనమందరం కృషి చేద్దామన్నారు. ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని గుర్తుచేశారు. గ్రామ పార్టీ సభ్యత్వ నమోదు కన్వీనర్‌గా చిత్రం శ్రీను, కో-కన్వీనర్‌లుగా కుంటి భాస్కర్, రాహుల్‌ను నియమించారు. మల్లారెడ్డి, అనితప్రభాకర్, నర్సింహారెడ్డి, బల్దె రాజు, నారాయణరావు, తీగల సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సన్మానం



మలక్‌పేట: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మలక్‌పేట ఏ-బ్లాక్ ప్రెసిడెంట్ బద్దం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తూ ఆరు గ్యారంటీలు ప్రజలకు అందేలా చూస్తామని ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి పేర్కొన్నారు.

పార్కుల చుట్టూ కంచె వేయాలని వినతి

బడంగ్‌పేట్: పార్కుల చుట్టూ కంచె వేసి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లో బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్‌లోని ఎంసీఆర్ కాలనీలో లే అవుట్‌లో మూడు చోట్ల పార్కుల కోసం కేటాయించిన స్థలాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తుచేశారు. ఈ స్థలాలు కబ్జాలకు గురికాకుండా ఉండాలంటే కంచె వేయాలని కోరారు. ఈ విషయంలో అధికారులు స్పందించి వెంటనే పార్కుల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ వేయాలని అధికారులను ఆయన కోరారు.

కృతజ్ఞతలు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

మన్సూరాబాద్: రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్టైన గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో కలిసి శనివారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలను వారి వారి కార్యాలయాల్లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నర్సింహ్మా, బండి మధుసూధన్ రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పుట్టిన రోజు వేడుకలు



విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న కార్తికేయ

లింగోజిగూడ: సినీ హీరో గుమ్మకొండ కార్తికేయ పుట్టిన రోజు వేడుకలను శనివారం బైరామల్‌గూడ డాక్టర్స్ కాలనీలోని శ్రీ కీర్తన అనాథ, వృద్ధా, వికలాంగుల ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో లక్ష్యలను చేరేందుకు కృషి చేయాలని సూచించారు.బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైనదని, అనాథ అనే భావాన్ని దరి చేరనివ్వొద్దన్నారు. చిన్నారులు కంప్యూటర్ విద్యా నేర్చుకునేందుకు కావాల్సిన పరికరాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత ప్రతి ఒక్కరు ఇతరులకు సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగుర్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, వైస్ చైర్మన్ జి.రజినీ విఠల్‌రెడ్డి, డైరెక్టర్ లోహితరెడ్డి, అకాడమిక్ డీన్ రాజశేఖర్, సీఏఓ శేషరావు, ఆశ్రమ నిర్వాహకులు అనిల్, మీనాక్షి పాల్గొన్నారు.